

వాకౌట్

చైర్‌పర్సన్ పార్టీ మారారని సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ సభ్యులు

- అవమానాలు భరించలేకే పార్టీ మారాను : చైర్‌పర్సన్
- కోరం లేకపోవడంతో జరగని జిల్లా పరిషత్ సమావేశం
- హాజరైన సభ్యులకు వీడ్కోలు, సత్కారం
- బహిష్కరించి బయటకు వచ్చిన పలువురిలో అంతర్మథనం
- ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం బీఆర్ఎస్ అధినేతల నుంచే అలవాటు : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



జడ్పీ సమావేశాన్ని బహిష్కరిస్తున్న సభ్యులు, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 14: ఐదేళ్లపాటు ఎన్నో సమస్యల పరిష్కారానికి వేదిక.. అక్కడికి వెళితే వారికంటూ ప్రత్యేక గౌరవం.. తోటి సభ్యులతో కలిసి ఎన్నో జ్ఞాపకాలు ఇచ్చిన ఈ వేదికను చివరిసారి వదిలి వెళ్లడం బాధతో కూడుకున్నది.. అలాంటి అవకాశాన్నే జడ్పీటీసీ సభ్యులు వదులుకున్నారు.. మరో 20 రోజుల్లో జిల్లాపరిషత్ పాలకమండలి గడువు ముగియనుంది.. ఈ పరిస్థితుల్లో శుక్రవారం నిర్వహించిన జిల్లాపరిషత్ సమావేశాన్ని మెజారిటీ సభ్యులున్న బీఆర్ఎస్ బహిష్కరించడంతో కోరం లేక సభ నిర్వహించలేదు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జీ మధు సూదన్‌రెడ్డి సభ్యులను సభకు పిలిచే ప్రయత్నం చేసినా ఒకరిద్దరు మినహా ఎవరూ హాజరు కాలేదు. సభ్యుల కోసం గంట పాటు ఎమ్మెల్యేలు వేచిచూశారు. అయినా రాకపోవడంతో అక్కడే ఉన్న జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు సన్మానం చేశారు.

శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ సభ్యులు వచ్చారు. జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి వేదికపై కూర్చోగానే మూసాపేట జడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నుంచి తమ ఓటుతో జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికై పార్టీ మారడాన్ని నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. వెంటనే ఎమ్మెల్సీతో పాటు బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు బయటకు వెళ్లిపోయారు. కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే సభలో ఉన్నారు. ఆ తరువాత ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జీ మధుసూదన్‌రెడ్డి సమావేశానికి వచ్చారు. సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారన్న సంగతి తెలుసుకుని కొందరికి ఫోన్ చేసి సమావేశానికి హజరయ్యే ప్రయత్నం చేశారు. ఒకరిద్దరు బీఆర్ఎస్ సభ్యులు వచ్చినా మిగతా వారెవరూ రాలేదు. గంటకు పైగా వేచిచూసిన అనంతరం కోరం లేక సభను ముగించారు. హాజరైన నలుగురు జడ్పీటీసీ సభ్యులు, నలుగురు ఎంపీపీలు, ఓ కో ఆప్షన్ సభ్యుడిని ఎమ్మెల్యేలు, జడ్పీ సీఈవో సత్కరించారు. ఆ తరువాత ఎన్నికైన తరువాత తొలిసారి సభకు వచ్చిన ఎమ్మెల్యేలను కూడా సత్కరించి గ్రూప్‌ఫొటో దిగారు.

చివరి సమావేశం బహిష్కరణపై చర్చ

ఐదేళ్లపాటు సభ్యులుగా ఉండి ఎన్నో సమావేశాల్లో పాల్గొని ఆయా మండలాల సమస్యలపై ప్రశ్నించి పరిష్కరించుకున్న సభ్యులు తమ చివరి సమావేశాన్ని ఇలా బహిష్కరించుకోవడంపై పలు రకాల చర్చకు దారితీసింది. ఎంతో సంతోషంగా, గత జ్ఞాపకాలు నెమరేసుకుని ఓ మంచి జ్ఞాపకంగా మిగిలిపోవాల్సిన వీడ్కోలు సమావేశాన్ని సభ్యులు బహిష్కరించడం సరైన నిర్ణయం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పెద్ద మనసు చేసుకుని సన్మానం చేయించుకోవడానికైనా రావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరినా రాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. గంటకు పైగా వేచి ఉండటంతో ఎమ్మెల్యేలు హుందాగా వ్యవహరించారన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ప్రజాస్వామ్యమంటే బీఆర్ఎస్‌కు గౌరవం లేదు

ప్రజాసామ్యం అంటే బీఆర్ఎస్ అధినాయకులకే గౌరవం లేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సమావేశానికి రావాలని సభ్యులకు ఉన్నా హైదరాబాద్‌నుంచి వాళ్ల నాయకుల ఫోన్ల కారణంగా రాలేదన్నారు. పార్లమెంట్ సమావేశాలలో తెలంగాణ బిల్లు పెడుతున్న సమయంలోనూ కేసీఆర్ వెళ్లలేదని, ఇప్పుడు ప్రతిపక్షనాయకుడుగా అసెంబ్లీకి వచ్చి సమావేశాలలో పాల్గొనాలని అంటే సమావేశాలకు రావడం లేదని అన్నారు. ప్రజాస్వామ్య విలువలపై బీఆర్ఎస్ నాయకులకు లేదని అందుకే ప్రజలు వీళ్లకు పార్లమెంట్ ఎన్నికలో ఒక్క సీటు కూడా ఇవ్వలేదని అన్నారు. జడ్పీ సమావేశాన్ని కోరం లేకుండా చేయాలని ప్రయత్నాలు చేసిన వాటిని ఖాతరు చేయకుండా వచ్చిన సభ్యులకు అభినందలను తెలుపుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో అందరం కలిసి ప్రజాస్వామ్యాన్ని బతికించుకుందామని అన్నారు.

- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పాలమూరు ఎమ్మెల్యే

పార్టీ కోసమే పని చేశా : జడ్పీ చైరసర్సన్

తనకు జడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చిన కేసీఆర్‌కు రుణపడి ఉంటానని, ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి నిబద్ధతతోనే పనిచేశానని జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధా కర్‌రెడ్డి అన్నారు. పార్టీలో అసెంబ్లీ ఎన్నికల తరువాత జరిగిన అవమానాలు భరించలేకే పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుటుంబంలోని ఆరోగ్య సమస్యల కారణంగా ప్రచారానికి దూరంగా ఉన్నాని తెలిపారు. తనవల్లే ఎమ్మెల్యే ఓడి పోయారని అవమానించారని, పార్టీలో ఉన్నంత వరకు తాను పార్టీకే పనిచేశానని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌కు ఫోన్‌ట్యాపింగ్ అలవాటే కదా తాను ఎవరితోనైనా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినట్లు ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు.



సన్మానం పొందిన సభ్యులతో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జీ మధుసూదన్‌రెడ్డి

వివాహిత ఆత్మహత్య

జడ్చర్ల, జూన్ 14 : మగపిల్లలు పుట్టలేదని, పుట్టిన ఒక కుమార్తె అనారోగ్యం కారణంతో మృతి చెందిందని మనస్తాపానికి గురై వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఆలూరు గ్రామంలో చోటు చేసుకుంది. జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. భూత్పూర్ మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన అపర్ణకు ఆలూరుకు చెందిన షైబుతో వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ నెల 13న భర్త మేస్త్రీ పనికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో రేకుల పైకప్పుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అపర్ణ సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రీన్‌ట్రైబ్యునల్

ఆదేశాలు బుట్టదాఖలేనా?

- కేసరి సముద్రంలో అక్రమ కట్టడాలను కూల్చివేయని అధికారులు
- రోజురోజుకు చెరువును ఆక్రమిస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా
- బయోఫెన్సింగ్‌పై నోరు మెదపని ఇరిగేషన్ అధికారులు



కేసరి సముద్రంలో వెలసిన అక్రమ కట్టడం

నాగర్‌కర్నూల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సప్తసముద్రాల్లో ఒకటైన నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం దురాక్రమణపై అధికారుల్లో నెలకొన్న నిర్లిప్తత విమర్శలకు దారి తీస్తోంది. కోట్ల రూపాయలు విలువ చేసే కేసరి సముద్రం భూముల ఆక్రమణకు సంబంధించి అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం కేసరి సముద్రం దురాక్రమణలను తొలగించాలని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశించినా అధికార యంత్రాంగంలో కనీస కదలికలు లేవు. చెరువు చుట్టూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల్లో అక్రమ కట్టడాలను తక్షణం కూల్చివేయాలని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశించినప్పుడు ఉయ్యాలవాడ శివారులోని కేసరి సముద్రం అంతర్భాగంలో ఉన్న భవనాన్ని కూల్చేసిన అధికారులు ప్రైవేట్ వ్యక్తుల జోలికి మాత్రం వెళ్లలేదు.

రియల్ ఎస్టేట్ మాఫియాదే ఆధిపత్యం..

కేసరిసముద్రం ఎఫ్‌టీఎల్‌లో పాగా వేసిన రియల్ ఎస్టేట్ మాఫియా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వస్తోంది. రియల్ మాఫియాకు చెందిన ముగ్గురు అధికారం మారినప్పుడల్లా వారి పంచన చేరుతూ చెరువులు, కుంటలను దిగమింగుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఎండబెట్ల గ్రామం నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోకి రావడంతో వారి పంట పండింది. కేసరి సముద్రానికి ఆనుకుని ఉన్న ఎకరా, అర ఎకరా భూములను కొనుగోలు చేసి ఏకంగా చెరువునే ఆక్రమించారు. ఈ క్రమంలో గ్రామస్థులు, మాజీ మంత్రినాగం జనార్దన్‌రెడ్డి నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆశ్రయించారు. దీనిపై రెవెన్యూ, మునిసిపాలిటీల బృందం సంయుక్త సర్వే నిర్వహించి ఆక్రమణలు నిజనమేనని తేల్చింది. కేసరి సముద్రం పరివాహక ప్రాంతం ఉయ్యాలవాడ నుంచి ఎండబెట్ల వరకు అనేక ఆక్రమణలు జరిగాయని నివేదిక కూడా ఇచ్చింది. అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగించాలని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ అప్పటి కలెక్టర్‌ను ఆదేశించింది. అనేక రాజకీయ కారణాల దృష్ట్యా కేసరి సముద్రం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోగా ఉయ్యాలవాడ శివారులో ఒక ప్రభుత్వ భవనం చెరువు శిఖంలో ఉందంటూ మూసివేసి చేతులు దులుపుకున్నారు.

అధికార పార్టీ పంచన చేరేందుకు యత్నం..

నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు కేసరి సముద్రం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగించాలని ఒత్తిడి రావడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన ముగ్గురు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించగా వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని తెలిసింది. మధ్యవర్తుల ద్వారా సంధి యత్నాలు చేయగా మీ లాంటి వాళ్లు మా దరికి రావద్దంటూ ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కఠినంగా హెచ్చరించినట్లు సమాచారం.

జోరుగా ఇసుక దందా

- పట్టపగలు ట్రాక్టర్లతో ఇసుక సేకరణ.. రాత్రిళ్లు సరఫరా
- సంగాల, గోనుపాడుల వద్దే ఫిల్టర్
- అక్రమాలకు నిలయంగా గద్వాల మండలం



సంగాల రిజర్వాయర్ ఫిల్టర్ చేయడానికి సిద్ధంగా ఉంచిన ఇసుక

గద్వాల, జూన్ 14: గద్వాల మండలంలో పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరుగుతుండగా.. మరోపక్క జోరుగా ఫిల్టర్ ఇసుక దందా నడుస్తోంది. ఈ మండలం అక్రమాలకు నిలయంగా మారుతోంది. మండలంలోని గోనుపాడు, సంగాల గ్రామాలలో మట్టి, ఇసుక దందా చేసేవారు చాలా మంది ఉన్నారు. ఈ గ్రామాల పరిధిలో 99వ ప్యాకేజీ కాలువ ఉండటంతో మట్టి సులభంగా లభిస్తోంది. అదేవిధంగా నెట్టంపాడు ప్రాజెక్టులో భాగమైన సంగాల రిజర్వాయర్ కూడ ఇక్కడే ఉంది. దాని కింద ఉన్న వాగు సంగాల గ్రామం మీదుగా సంగాల చెరువుకు చేరుతుంది. అక్కడ నుంచే ఫిల్టర్ ఇసుక దందా నడుస్తోంది.

'మన ఇసుక వాహనం' తగ్గిపోవడంతో...

తుంగభద్ర నది నుంచి మన ఇసుక వాహనంతో ప్రభుత్వమే ఇసుకను తరలిస్తున్నది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, తుంగభద్రలోకి కొద్దిగా నీటి ప్రవాహం రావడంతో మన ఇసుక వాహనాలు చాలా తగ్గిపోయాయి. దీంతో గద్వాలలో ఇసుక కొరత ఏర్పడింది. టీఎస్ఎండీసీ ద్వార ప్రభుత్వ పనులకే అనుమతులు ఇస్తుండటంతో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక లభించక డిమాండ్ పెరిగింది. ఇసుకను ఫిల్టర్ చేసే ముఠాకు వరంగా మారింది. దానికితోడు ఈ ఏడాది సంగాల రిజర్వాయర్ పూర్తి ఒట్టిపోయింది. దీంతో చాలా ఇసుక బయటపడింది. అందులో కొంతమేర మట్టి శాతం ఉండటంతో దానిని ఫిల్టర్ చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలం మీదుగా పీడీఎస్ రైస్ రాయిచూర్‌కు రవాణా అవుతున్నది, సంగాల, గోనుపాడు గ్రామాల నుంచి ఫిల్టర్ ఇసుక, మట్టి రవాణా అవుతున్నది. వీటిని నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. అదేవిదంగా పోలీస్ పెట్రోలింగ్ వ్యవస్థ కూడ సక్రమంగా పనిచేయడం లేదు. గద్వాల మండలం నుంచి వెళ్లిన పీడీఎస్ రైస్ కేటీదొడ్డి పోలీసులకు పట్టుబడుతున్నాయి.. కానీ గద్వాల పోలీసులకు దొరకడం లేదంటే ఏదో జరుగుతోందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఫిల్టర్ ఇసుక తయారీ ఇలా..

సంగాల రిజర్వాయర్ గోనుపాడు, సంగాల గ్రామాలకు సమీపంలో ఉంది. వర్షాలు కురిసినపుడు వచ్చే వరద ప్రవాహానికి ఇసుక ఏర్పడుతుంది. దానిని రిజర్వాయర్ చివరలో సేకరించి ఒకచోటికి చేరుస్తున్నారు. అందులో కొంత మట్టి శాతం ఉంటుండటంతో దానిని తొలగించడానికి ఫిల్టర్ చేయాల్సి ఉంటుంది. కొందరు అక్కడే పెద్దపెద్ద గుంతలు(బావులు) మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఆ మోటార్ల ద్వారా వచ్చే నీటితో ఫిల్టర్ చేస్తుండగా మరికొందరు అక్కడి నుంచి వాళ్ల సొంత బోర్లు, బావుల వద్దకు తరలించి అక్కడ ఫిల్టర్ చేస్తున్నారు. రాత్రిళ్లు ఫిల్టర్ చేసి అర్ధరాత్రి, తెల్లవారుజామున గద్వాల పట్టణానికి తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.

మా దృష్టికి రాలేదు



ఫిల్టర్ ఇసుక తయారీ, రవాణా అవుతున్నట్లు మా దృష్టికి రాలేదు. వాటిపై నిఘా పెడతాం. సంగాల, గోనుపాడు పరిధిలో ఇసుక డంపులు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సీజ్ చేయిస్తాం.

- పర్వతాలు, రూరల్ ఎస్సై, గద్వాల



ఇసుకను ఫిల్టర్ చేసేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు

డాక్టర్ నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

- ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

నారాయణపేట టౌన్, జూన్ 14 : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే కడుపులో బిడ్డ పరిస్థితి విషమించి తల్లి మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్కూరు మండలానికి చెందిన సమీనాబేగాన్ని (28) ఆరేళ్ల కిందట మక్తల్‌కు చెందిన కారు మెకానిక్ అంజద్‌తో వివాహం జరిపించారు. రెండు ప్రసవాల్లో ఆపరేషన్ ద్వారా కూతురు, కుమారుడికి జన్మనిచ్చింది. సమీనా బేగం ప్రస్తుతం గర్భవతిగా ఉన్నది. చికిత్స కోసం మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి బైక్‌పై వచ్చారు. వైద్యం చేయించుకొని తిరుగు ప్రయాణంలో కొల్లూరు స్టేజీ వద్ద బైక్‌పై నుంచి కిందపడ్డారు. తిరిగి వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చి అడ్మిట్ అయ్యారు. పరీక్షించి కడుపులో బిడ్డ బాగానే ఉందని సూచించారు. సమీనాబేగం ఆస్పత్రిలోనే ఉన్నారు. గురువారం స్కానింగ్ చేసి కడుపులో బిడ్డ చనిపోయిందని డాక్టర్ కుటుంబ సభ్యులకు తెలిపారు. చనిపోయిన బిడ్డను తీసి తల్లిని కాపాడాలని కుటుంబ సభ్యులు డాక్టర్‌ను కోరారు. చికిత్స కోసం డబ్బులు చెల్లించాలని డాక్టర్ సూచిండంతో డబ్బులు కూడా చెల్లించారు. ఆ తర్వాత తల్లి పరిస్థితి విషమంగా ఉందని మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. సమీనాను కుటుంబసభ్యులు గురువారం రాత్రి హైదరాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు తెలిపారు. దీని అంతటికి డాక్టర్ నిర్లక్ష్యమే కారణమని శుక్రవారం నారాయణపేట పట్టణంలోని ఆసుపత్రి ముందు మృతదేహంతో కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. పోలీసులు అక్కడకు చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఇందులో డాక్టర్ తప్పేమి లేదని బాధిత కుటుంబసభ్యులకు వివరించారు. సకాలంలో చికిత్స చేసి ఉంటే తమ కూతురు బతికేదని వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే కడుపు లో బిడ్డ, తల్లి చనిపోయిందని ఆరోపించారు. బాధిత కుటుంబసభ్యులు రూ.10లక్షలు డిమాండ్ చేస్తూ ఆందోళన తీవ్రం చేయడంతో సంబంధిత డాక్టర్‌ను పిలిపించి డిమాండ్ చేసిన దానికన్నా కొంత తక్కువ డబ్బులు ఇప్పించి సమస్యను పరిష్కరించిన్నట్లు తెలిసింది.

మల్బరీ సాగుకు ప్రోత్సాహం

- ఈ ఏడాది వనపర్తి జిల్లాలో 50 ఎకరాల్లో సాగు లక్ష్యం



పెద్దమందడి : మల్బరీ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 14: సంప్రదాయ పంటలకే పరిమితమవుతున్న రైతులను ఇతర పంటలవైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారిస్తేనే ఆర్థికంగా స్థిరపడతారని ప్రభుత్వం వివిధ పథకాలతో ప్రోత్సాహకాలు అందిస్తోంది. అందులో భాగంగానే మల్బరీ తోటల సాగువైపు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. మల్బరీ తోటలు సాగు చేయాలనుకునే రైతులకు తోటల సాగు, నీటి వసతి, షెడ్డు నిర్మాణం కోసం అయ్యే ఖర్చులో ప్రభుత్వం కొంత మొత్తాన్ని రాయితీగా అందించనున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా ఉద్యాన శాఖ 50 ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది.


మల్బరీ సాగుకు రాయితీలతో ప్రోత్సాహం

మల్బరీ తోటలు సాగు చేయాలనుకునే రైతులకు సబ్సిడీలు అందించేందుకు ముందుకొచ్చింది. రెండు ఎకరాలలోపు మల్బరీ తోటల సాగుకు అయ్యే ఖర్చులో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన రైతులు 35శాతం ఖర్చును భరిస్తే మిగతా 65శాతం ఖర్చును ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇతర కులాలకు చెందిన రైతులు 50 శాతం ఖర్చును భరిస్తే మిగతా 50 శాతాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. మల్బరీని సాగు చేయాలంటే నీటి వసతి తప్పనిసరి. డ్రిప్పు ఇరిగేషన్ ఏర్పాటు చేసుకునే రైతులకు కూడా ప్రభుత్వం నుంచి సహకారం అందుతుంది. ప్రస్తుతం జిల్లాలో 40 ఎకరాలలో మల్బరీ తోటలు సాగు అవుతు న్నాయి. ఈ ఏడాది కూడా మరో 50 ఎకరాల్లో సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఉద్యాన శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మొద లుపెట్టారు. ఇతర పంటలతో పోలిస్తే మల్బరీ సాగు కాస్త భిన్నమైనది. ఒక్కసారి పంట వేస్తే 20ఏళ్ల పాటు సాగు చేసుకోవచ్చు. ఏడాదికి ఎనిమిది నుంచి 10 పంటల వరకు తీసుకోవచ్చు. పట్టుకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండడంతో మల్బరీ సాగుపై దృష్టి సారిస్తే ఆర్థికంగా స్థిరపడవచ్చు అని ఉద్యాన శాఖ అధికారు లు చెబుతున్నారు. మొక్కలు, షెడ్ల నిర్మాణం, పట్టు గూళ్లకు ప్రభుత్వం నుంచి రాయితీలు అందడం కలిసి వచ్చే అంశమని అంటున్నారు.




పెద్దమందడిలో పెంచుతున్న పట్టు పురుగులు

మల్బరీ సాగుపై దృష్టి సారించాలి



మల్బరీ తోటలు సాగు చేయాలనుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మల్బరీ సాగుపై దృష్టి సారించాలి. మల్బరీ సాగుతో ఆర్థికంగా ఎదగొచ్చు. ఆసక్తి ఉన్న రైతులు తమకు అందుబాటులో ఉన్న హార్టికల్చర్ అధికారులను, జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో కలిసి దరఖాస్తు చేసుకోవచ్చు.

- సురేష్, జిల్లా హార్టికల్చర్ అధికారి





టీఎస్ హాక్‌ఐ యాప్ హ్యాక్‌తో

నిలిచిన ఆన్‌లైన్ సేవలు

- ఉద్యోగుల సెలవులు, ఈ చలానా, ఫైల్స్ అప్‌డేట్ సేవలు బంద్
- ఒకట్రెండ్రోజుల్లో క్లియర్ అవుతుందంటున్న పోలీసులు
- ఇప్పటికే అందుబాటులోకి డయల్ 100, ఎఫ్ఐఆర్‌లు

మహబూబ్‌నగర్, జూన్ 14 : పోలీస్‌శాఖకు సంబంధించిన టీఎస్ హాక్ ఐ, టీఎస్ కాప్స్ యాప్‌ల ద్వారానే అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు చేస్తుంటారు. ఆపద సమయాల్లో ప్రజలు హాక్ ఐ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించవచ్చు. హాక్‌ఐ మొబైల్ అప్లికేషన్‌లో సేవ్ అవర్ సౌల్స్ (ఎస్ఓఎస్) బటన్ నొక్కితే కంట్రోల్ రూమ్‌కు మెసేజ్ వెళ్లడం జీపీఎస్ ద్వారా ఆపదలో ఉన్నవారి చోటును కనిపెట్టి అక్కడికి వేగంగా పోలీసులు చేసుకుంటారు. అలాంటి హాక్ ఐ యాప్‌ను పది రోజుల క్రితం హ్యాక్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ శాఖ మరో యాప్ హ్యాక్ కాకుండా ముందుజాగ్రత్త చర్యగా పోలీస్ శాఖ టీఎస్ కాప్స్ యాప్ సేవలు నిలిపివేయడంతో అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. కేసులు కట్టాలన్నా, ఈ చలానా వేయాలన్నా, ఫైల్స్ అప్‌డేట్ చేయాలన్నా, డయల్ 100 కాల్ అటెప్ట్ చేయాలన్నా, ఉద్యోగులకు సెలవులు ఇవ్వాలన్నా ఈ యాప్‌ను ఆన్‌లైన్‌లో ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అలాంటి యాప్ హ్యాక్ కావడంతో ఒక్కసారిగా అన్ని రకాల సేవలు నిలిచిపోయాయి. వెంటనే తేరుకున్న పోలీసు శాఖ ముందుగా ఎఫ్ఐఆర్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ తరువాత డయల్ 100 సేవలు క్లియర్ చేసుకున్నారు. ఇక మిగిలిన పలు రకాల ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ఈ చలానా, ఈ పిటీ కేసులన్నీ ఆన్‌లైన్ ద్వారానే అవుతుంటాయి. ప్రస్తుతం యాప్ హ్యాక్‌తో ఆ సేవలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయాయి. ఈ చలానాను అందు బాటులోకి తీసుకువచ్చే పనిలో పడ్డారు. ఒకట్రెండ్రోజుల్లో అన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయని పోలీసులు చెబుతున్నారు. మళ్లీ యాప్‌లు హ్యాక్ కాకుండా ఉండేందుకు ప్రతీ ఆన్‌లైన్ సేవకు మొబైల్ ఓటీపీని అనుసంధానం చేసే ప్రయత్నం చేస్తుండటంతో ఆన్‌లైన్ యాప్‌ల సేవలలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.



టీఎస్ హాక్ ఐ యాప్ లోగో

నీటి సంపులో పడి మహిళ మృతి

కోడేరు, జూన్ 14 : నీటి సంపులో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఉప్పరి కళమ్మ(40) అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతుండేది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు విజయలక్ష్మి, లావణ్యలు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేయడంతో ఇంటి దగ్గర ఒంటరిగానే ఉండేది. అనారోగ్యంతో ఉండడంతో తీగలపల్లికి చెందిన చిన్న అల్లుడు మధు అత్తను గురువారం ఆసుపత్రిలో చూపించి కోడేరులో తన ఇంటి దగ్గర వది లేసి వెళ్లాడు. తిరిగి శుక్రవారం ఉదయం రావడంతో ఆమె కన్పించకపోవడంతో చుట్టుపక్కల వారిని అడిగాడు. స్పందన లేకపోవడంతో ఇంటిముందు సంపులోకి చూడగా శవమై కన్పించింది.













ఆటాడుకుందాం..

- క్రీడా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు
- స్పోర్ట్స్‌లో రాణించాలనుకునే చిన్నారులకు సదావకాశం
- హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో స్కూళ్లు
- ఈనెల 21 నుంచి 25 వరకు మండల, 27 నుంచి 30 వరకు జిల్లా స్థాయి ఎంపికలు
- వచ్చేనెల11, 12న హకీంపేటలో రాష్ట్ర స్థాయి ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 14 : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనుకునే విద్యార్థులకు ఇదొక మంచి అవకాశం. ఆటల్లో ఆసక్తి ఉన్నవారిని ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయడమే కాకుండా కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్న ప్రభుత్వం రాష్ట్రంలో మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలలను నడిపిస్తోంది. వీటిలో 120(బాలికలు 60, బాలురు 60) సీట్ల కోసం క్రీడల ఎంపికలు నిర్వహించనున్నది. ఇందులో ఎంపికైన వారికి మెరుగైన శిక్షణ ఇస్తూనే ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య కల్పిస్తున్నది. రాష్ట్రంలో మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలలు మేడ్చల్ జిల్లాలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశాలకు ఎంపిక తేదీలను ప్రకటించింది. ఒక్కో పాఠశాలలో 40 సీట్లు ఉండగా.. బాలికలకు 20, 20 బాలురకు అవకాశం కల్పిస్తారు. ఇందుకోసం అర్హత పరీక్షలను నిర్వహిస్తారు. విద్యార్థులకు మండల, జిల్లా స్థాయిలో శారీరక సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలు యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ప్రతిభ చూపిన వారికి క్రీడా పాఠశాలల్లో అవకాశం కల్పిస్తారు. తర్వాత హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తారు. ఎంపికైన విద్యార్థులకు రెండేళ్లపాటు ప్రత్యేక వ్యాయామాలు నేర్పించి, ఏ ఆటలో రాణించే అవకాశం ఉంటుందో అందులో నిపుణులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తారు.

ఎంపికలకు తీసుకురావాల్సిన ధ్రువప్రత్రాలు

విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, హెచ్‌ఎం జారీ చేసిన మూడవ తరగతి బోనఫైడ్, ఉత్తీర్ణత సాధించిన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో పోటీలకు హాజరుకావాలి. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తీస్తే కఠినమైన చర్యలు తీసుకుంటారు.

మూడు స్థాయిల్లో ఎంపికలు

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అర్హత పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 21 నుంచి 25 వరకు మండల స్థాయిలో నిర్వహిస్తారు. సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో ఎంపికలు నిర్వహిస్తారు. ఇక్కడ కనీసం 10 పాయింట్లు సాధిస్తేనే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఇక్కడ జులై 11, 12న మేడ్చల్ జిల్లాలోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తారు. వారికి నాలుగో తరగతిలో ఆగస్టులో ప్రవేశాలు కల్పిస్తారు.



స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం గత సంవత్సరం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలు

ఎంపిక అర్హతలు

ప్రవేశాల కోసం ఎనిమిది నుంచి తొమ్మిది సంవత్సరాల వయస్సు ఉండి, 2015 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్యకాలంలో జన్మించిన వారు ఎంపికలకు అర్హులు.

సామర్థ్య పరీక్షలు

విద్యార్థుల ఎత్తు, బరువు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 60 మీటర్ల షటిల్‌రన్, 800 మీటర్ల పరుగుల పందెం, స్టాండింగ్ బ్రాండ్ జంప్, ఫ్లెక్సీబిలిటి టెస్ట్, మెడిసిన్‌బాల్‌త్రో తదితర పరీక్షలు నిర్వహిస్తారు.

వీరు అనర్హులు

దొడ్డికాళ్లు, ఫ్లాట్‌ఫీట్, వెన్నెముక వంగి ఉన్నవారు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, బౌలెగ్స్ కలిగిన వారు, శరీరంలో ఎముకలు విరిగిన విద్యార్థులు ప్రవేశాలకు అనర్హులు.

28న జిల్లా స్థాయి ఎంపికలు



మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి ఈ నెల 28న జిల్లా స్టేడియం మైదానంలో స్పోర్ట్స్ స్కూల్‌లో నాల్గవ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయి. విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, హెచ్‌ఎం జారీ చేసిన మూడవ తరగతి బోనఫైడ్, ఉత్తీర్ణత సాధించిన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో పోటీలకు హాజరుకావాలి. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తీస్తే కఠిన చర్యలు ఉంటాయి.

- ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

అయిజ ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

- విధులు బహిష్కరించిన న్యాయవాదులు
- డీఎస్పీకి ఫిర్యాదు



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

గద్వాల క్రైం, జూన్ 14 : అయిజ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గద్వాల న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి, కోర్టు ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గద్వాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ సివిల్ వివాదంలో తలదూర్చడంతో పాటు, ప్రశ్నించిన న్యాయవాది సురేష్‌గౌడ్‌ను దుర్భాషలాడి, బెదిరింపులకు దిగిన అయిజ ఎస్సై విజయభాస్కర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అయిజ పోలీస్‌స్టేషన్‌తో పాటు, జిల్లాలో ఉన్న దాదాపు అన్ని పోలీస్‌స్టేషన్లలో ఎస్సైలు సివిల్ తగాదాల్లో తలదూర్చుతున్నారని ఆయన పేర్కొన్నారు. పోలీసులు సివిల్ తగాదాల్లో తలదూర్చవద్దని అత్యున్నత, ఉన్నత న్యాయస్థానాలతో పాటు ఉన్నతాధికారులు ఎన్నిసార్లు ఉత్తర్వులు జారీ చేసినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. పైగా ప్రశ్నించిన పౌరులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి డీఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఖాజామొయినుద్దీన్, కొండాపురం షఫీవుల్లా, పూజారి శ్రీధర్, నిజాంకారి మురళి తదితరులున్నారు.

వన్యమృగాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రేంజ్ ఆఫీసర్ మగ్దూమ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రేంజ్ ఆఫీసర్ సయ్యద్ మగ్దూమ్

నవాబ్‌పేట, జూన్ 14 : వన్యమృగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అడవికి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని మహ్మదాబాద్ రేంజ్ అధికారి సయ్యద్ మగ్దూమ్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొత్తపల్లి గ్రామంలో గ్రామస్థులకు వన్యమృగాల పట్ల అవగాహన కల్పించారు. గురువారం రాత్రి గ్రామానికి చెందిన పెంటల శేఖర్ అనే యువకుడు బహిర్భూమికి వెళ్లగా గుర్తుతెలియని వన్యమృగం దాడి చేయడంతో శుక్రవారం ఉదయం రేంజ్ అధికారి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కొత్తపల్లి, కన్మన్‌కాల్వ, లింగన్నపల్లి అటవీప్రాంత గ్రామాల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శేఖర్‌పై దాడి చేసింది చిరుతనా, కాదా అనే విషయం పూర్తి స్థాయి విచారణ జరుపుతామన్నారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం గ్రామాల్లో సాయంత్రం చాటింపు వేయించారు. రేంజ్ అధికారి వెంట డీఆర్వో సుమలత, శ్రీనివాసులు, సెక్షన్ అధికారి సురేందర్, తాజొద్దీన్, స్వాతి, బీట్ ఆఫీసర్ అన్నపూర్ణ, శ్రీనివాస్, మహిపాల్ ఉన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

- మద్యం మత్తులో గడ్డిమందు తాగిన అన్నదాత
- ఎస్సై స్టేషన్‌కు పిలిచాడనే భయంతో గడ్డిమందు తాగాడని బాధిత కుటుంబీకుల ఫిర్యాదు



శేఖర్‌రెడ్డి (ఫైల్)

నర్వ, జూన్ 14 : ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన చిన్నపాటి వాగ్వాదాన్ని తట్టుకోలేక మద్యం తాగిన ఆ రైతు అదే మత్తులో గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మున్నూరు శేఖర్‌రెడ్డి(38) బుధవారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలం వద్ద ఉండగా ఆ పక్కనే ఉన్న జాంగ్రగుట్ట ప్రభుత్వ భూమిని పరిశీలించడానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడికి చేరుకున్నారు. దీంతో శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే వద్దకు వెళ్లి గతంలో ఉన్న ఎస్సై మళ్లీ ఇక్కడికి వస్తున్నారని.. ఆ ఎస్సై తనపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశాడని, అతన్ని రానీయవద్దని ప్రశ్నించాడు. దీంతో పక్కనే ఉన్న కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డిని మందలించడంతో వారితో వాగ్వాదానికి దిగాడు. జరిగిన వాగ్వాదం గురించి శేఖర్‌రెడ్డి మద్యం తాగుతూ గ్రామస్థుల వద్ద విచారం వ్యక్తం చేశాడు. మరుసటిరోజు ఉదయం పోలీసులు శేఖర్‌రెడ్డి ఇంటికి వెళ్లి అతని గురించి వాకబు చేశారు. మరోవైపు ఎస్సై ఫోన్ చేయడంతో తప్పించుకు తిరిగిన శేఖర్‌రెడ్డి సాయంత్రం సమయంలో మద్యం తాగి వ్యవసాయ పొలానికి వెళ్లి మత్తులో గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన గ్రామస్థులు కుటుంబీకులకు విషయాన్ని తెలుపగా వారు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి శేఖర్‌రెడ్డి మృతి చెందాడు. మృతుడికి భార్య రాఘవేంద్రమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

గద్వాల, జూన్ 14 : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని సంగాల గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై పర్వతాలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజు(27) కొంతకాలంగా మద్యానికి బానిసై పనీపాట లేకుండా తిరుగుతున్నాడు. ఆర్థిక సమస్యలు తోడు కావడంతో మనస్తాపానికి గురైన రాజు శుక్రవారం ఉదయం వ్యవసాయం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

కోడెదూడలను కాపాడిన పోలీసులు

అలంపూర్ చౌరస్తా, జూన్ 14 : ఏపీ నుంచి అక్రమంగా తరలిస్తున్న కోడెదూడలను జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి పోలీసులు గుర్తించి గోశాలకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. బక్రీద్ పండుగ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున తనిఖీలు చేస్తుండగా ఓ కంటైనర్‌లో 63 కోడెదూడలను గుర్తించారు. వాటిని తరలిస్తున్న డ్రైవర్ సయ్యద్ అక్బర్‌ను విచారించగా వాటన్నింటిని ఏపీలోని గోదావరి జిల్లా ఏలూరు పట్టణంలోని హనుమాన్ జంక్షన్‌లో కొనుగోలు చేసి బహదూర్‌పురకు చెందిన మహ్మద్‌ఖలీల్ ఆదేశాల మేరకు హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, యాజమాని మహ్మద్‌ఖలీల్, డ్రైవర్ సయ్యద్‌అక్బర్, కూలీలు మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ అఖీమ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసనాయక్ తెలిపారు. వాహనంలో ఉన్న 63 కోడెదూడలలో ఒకటి తొక్కిసలాటలో మృతి చెందిందని మిగతా వాటిని మహబూబ్‌నగర్ వద్దనున్న ఓ గోశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా, ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి నల్గొండకు తరలిస్తున్న ఒక వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 11 గేదెలు ఉన్నాయని, తొక్కిసలాటలో ఒకటి మృతి చెందినట్లు గుర్తించామన్నారు. గేదెలను తరలిస్తున్న మహ్మద్‌జహంగీర్, వాహన డ్రైవర్ శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి, గేదెలను బీచుపల్లి వద్దనున్న గోశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కల్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

- వంద కల్లు ప్యాకెట్లు స్వాధీనం

గద్వాల క్రైం, జూన్ 14 : ఇతర ప్రాంతాల నుంచి కల్లును తీసుకొచ్చి గద్వాలలో విక్రయిస్తున్న వ్యక్తిపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్సై వీరేశలింగం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బోయ సత్తన్న గ్రామం నుంచి వంద కల్లు ప్యాకెట్లను సంచిలో వేసుకొని గద్వాలలో విక్రయిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. అతని వద్దనుంచి వంద కల్లు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు.

మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నం

గండీడ్, జూన్ 14 : మద్యం మత్తులో బీరులో క్రిమిసంహారక మందు కలుపుకొని ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం లింగాయిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్నాచేడ్ గ్రామానికి చెందిన ఎం.రాజు శుక్రవారం సాయంత్రం తమ పొలం వద్ద బీరులో క్రిమిసంహారక మందును కలుపుకొని తాగాడు. గుర్తించిన కుటుంబీకులు 108లో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం, కేసు నమోదు

జడ్చర్ల, జూన్ 14 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత కనిపించడం లేదంటూ ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన ఈ దంపతులు జడ్చర్లలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 13న తన సోదరి డెలివరీ అయినందున మహబూబ్‌నగర్‌కు వెళ్లి తిరిగి జడ్చర్లకు వచ్చేసరికి భార్య కనిపించలేదని, ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేశాడని ఎస్సై వివరించారు.

వాహనం ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

మదనాపురం, జూన్ 14 : గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గోవిందహళ్లి గ్రామ శివారులో శుక్రవారం ఓ జింక రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద ఘటనపై ఆరా తీశారు. ఫారెస్టు అధికారులకు సంఘటన గురించి పోలీసులు తెలియజేశారు.

వీధి కుక్కల దాడిలో మూడు మేకల మృతి

లింగాల, జూన్ 14 : వీధి కుక్కలు దాడి చేయడంతో మూడు మేకలు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కోమటికుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు చంద్రకంటి శీను తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారిలా గురువారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలోని పాకలో మేకలను కట్టేసి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం వెళ్లి చూసేసరికి వీధి కుక్కలు దాడి చేయగా మూడు మేకలు మృతి చెందినట్లు వాపోయారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎర్రవల్లి, జూన్ 14 : జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం జింకలపల్లి స్టేజీ వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం పెను ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికి రెప్పపాటులో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న భారీ కంటైనర్ వాహనం అదుపు తప్పి డివైడర్ దాటుకొని అపసవ్య దిశలోకి వచ్చింది. ఎర్రవల్లి నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనానికి సెకన్ల వ్యవధిలో ప్రమాదం తప్పింది. ప్రమాద సంఘటన సీసీ ఫుటేజీ వాట్సాప్ గ్రూపులో వైరల్ అయింది.

ఇసుక టిప్పర్ పట్టివేత

జడ్చర్ల, జూన్ 14 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేట వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బాలాజీ వేబ్రిడ్జి వద్ద ఉన్న ఇసుక టిప్పర్‌ను పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్ గుర్తించి, ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. టిప్పర్ డ్రైవర్ కమ్ ఓనర్ నర్సిములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసేందుకు కుట్ర

- మాజీ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, జూన్ 14 : హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసేందుకు కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ హక్కులపై చంద్రబాబు విషం నూరి పోస్తున్నారని మండిపడ్డారు. మన రాష్ట్రంపై ఆయన పెత్తనం ఉంటుందని, అందుకే నీటిపారుదల శాఖ కార్యదర్శిగా తెలంగాణ వ్యతిరేక శక్తి అయిన ఆదిత్య దాస్‌ను రేవంత్‌రెడ్డి నియమించారని విమర్శించారు. లోలోపల ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ ప్రాంత ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండగడతారని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల నాయకుల పెత్తనం మన రాష్ట్రంలో చెల్లదని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరాశకు గురికాకుండా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్, మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని, మాట్లాడారు.

సుంకేశుల జలాశయానికి పెరిగిన వరద నీరు

- గేట్ ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు



జూరాలకు వచ్చి చేరిన వరద నీరు

రాజోలి, జూన్ 14 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్ర శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి శుక్రవారం వరద నీరు పెరిగిందని సుంకేసుల డ్యాం జేఈ రాజు తెలిపారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా శుక్రవారం ఉదయం డ్యాంకు 1600 క్యూసెక్కులు ఉన్న వరద సాయంత్రానికి 4,500 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి వచ్చి చేరుకుంది. దీంతో శుక్రవారం సాయంత్రం సుంకేసుల జలాశయం నుంచి ఒక గేటును ఒక మీటర్ ఎత్తుకు తెరిచి 4,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.026 టీఎంసీలుగా ఉందని, నీటి నిల్వ 292.00 మీటర్లు కాగా ప్రస్తుతం 291.50 మీటర్లు నమోదు అయినట్లు డ్యాం జేఈ రాజు వివరించారు. నదిలో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి ఎవరూ వెళ్లకూడదని, రాత్రికి మరీ పెరిగే ఆవకాశం ఉందని ఆయన తెలిపారు.

జూరాలకు కొనసాగుతున్న ప్రవాహం

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగడంతో ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల మేర నీటి నిల్వ చేరుకుంది. ఎగువనున్న ఆల్మట్టి జలాశయంలో 25.82 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువనున్న నారాయణపూర్ జలాశయంలో 24.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల జలాశయంలో 317.270 మీటర్లలో నీటి నిల్వ ఉండగా, ప్రాజెక్టులో 4.561 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. ప్రాజెక్టులో 6,558 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదు కాగా, నెట్టెంపాడు లిఫ్టుకు 354 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 568, కోయిల్‌సాగర్ లిఫ్టుకు 230, ఆవిరి రూపంలో 128 క్యూసెక్కుల నీరు విడుదల కాగా, మొత్తం ప్రాజెక్టు నుంచి 1280 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గుండేడులో ఎక్సైజ్ దాడులు

- రెండు కిలోల గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన ఏఈఎస్ నరసింహారెడ్డి



చారకొండలో బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



బాలానగర్ మండలం గుండేడులో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

జడ్చర్ల, జూన్ 14 : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గుండేడు గ్రామంలో శుక్రవారం జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి, ఎస్సై నాగరాజులు తమ సిబ్బందితో కలిసి దాడులు చేసి రెండు కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్‌లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి వెల్లడించారు. బాలానగర్ మండలం గుండేడు గ్రామంలో సభావత్ లక్ష్మీ అనే మహిళ గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఇంట్లో ఉన్న రెండు కిలోల వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని లక్ష్మీని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని చెప్పారు. రాజాపూర్ మండలం సింగన్నగూడకు చెందిన సభావత్ లక్ష్మీ గడిచిన ఎనిమిది నెలల క్రితం బాలానగర్ మండలం గుండేడు గ్రామంలో ఇళ్లు కొనుగోలు చేసి నివాసం ఉంటోందని వివరించారు. హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి గంజాయిని తీసుకువచ్చి ఐదు గ్రాములు, ఆరు గ్రాముల ప్యాకెట్లను తయారు చేసి, వివిధ కంపెనీలలో పనిచేసే వర్కర్లకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసిందని అన్నారు. హైదరాబాద్ నుంచి సరఫరా, ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారనే వివరాలను సేకరిస్తున్నామని, సభావత్ లక్ష్మీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఈఎస్ వివరించారు. దాడుల్లో జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి, ఎస్సై నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ మురళి, కానిస్టేబుళ్లు సిద్ధు, నరేశ్, జ్యోతి, రమేశ్‌లున్నారని ఆయన తెలిపారు.

చారకొండలో సారా స్థావరాలపై..

చారకొండ : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు వివేక్, అరుణలు తమ సిబ్బందితో కలిసి సారా స్థావరాలపై దాడులు చేశారు. దాడుల్లో 40 కేజీల పటిక, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఆగస్టు 31 వరకు తెలంగాణ రాష్ట్ర సారా రహిత భాగంగా దాడులు చేస్తున్నట్లు సీఐ వెంకట్ రెడ్డి తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష

మహబూబ్‌నగర్ లీగల్ కంట్రిబ్యూటర్, జూన్ 14 : అత్యాచారం కేసులో నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ కఠిన కారాగార జైలుశిక్ష విధించింది. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన దళిత అమ్మాయిని అత్యాచారం చేసిన గోడమల్లేష్ అలియాస్ గోడ మల్లికార్జున్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు మరో పదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ శుక్రవారం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి వి.శారదాదేవి తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయపల్లిలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్న మల్లికార్జున్ వద్దకు 2016 ఫిబ్రవరి నాలుగో తేదీన కడుపునొప్పితో వెళ్లిన బాధిత అమ్మాయిని నకిలీ డాక్టర్ అయిన అతను అదే క్లినిక్‌లో అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని ఆ అమ్మాయి తండ్రికి చెప్పడంతో ఆయన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సీ, ఎస్టీ, అత్యాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అప్పటి డీఎస్పీ కృష్ణమూర్తి మెడికల్ రిపోర్ట్‌తో పాటు కీలకపత్రాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పీపీ రాంభక్ష్ 13 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. వాదప్రతివాదనలు విన్న ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో దళిత అమ్మాయిని అత్యాచారం చేయడంతో ప్రత్యేక సెక్షన్‌ల ప్రకారం యావజ్జీవ కఠిన కారాగారశిక్ష, రూ.ఎనిమిది వేలు జరిమానా, అత్యాచారం కేసులో మరో పదేళ్ల జైలు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పీపీ బెక్కెం జనార్దన్ వెల్లడించారు.

గుంతల రోడ్డులో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు



గుంతల రోడ్డులో కూరుక్కుపోయిన బస్సును ఎక్స్‌కవేటర్ సహాయంతో తీస్తున్న సిబ్బంది

మల్దకల్, జూన్ 14 : గద్వాల ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు మండలంలోని ఎల్కూరు-మల్లెందొడ్డి గ్రామాల మధ్యలో గుంతల రోడ్డులో ఇరుక్కుపోయింది. ఇటీవల వర్షాలు కురువడమే కాకుండా గతంలో ఈ రోడ్డు గుండా భారీ ఇసుక వాహనాలు రాకపోకలు చేయడంతో రోడ్డంతా గుంతలమయంగా మారడంతో పాటు వరద నీటికి బురదమయమైంది. దీంతో శుక్రవారం గద్వాల నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు బురదలో కూరుకుపోయింది. ఆర్టీసీ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సహాయంతో బస్సును పక్కకు తీయించారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి

- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసు

- రహదారి భద్రతపై స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన



డ్రైవర్లకు రహదారి భద్రత నియమాలను వివరిస్తున్న ఎంవీఐ వాసు

మహబూబ్‌నగర్, జూన్ 14 : మోటారు వాహన చట్టం నిబంధనలు ప్రతీ వాహన డ్రైవర్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసు అన్నారు. నిబంధనలు పాటించినప్పుడే ఎలాంటి ప్రమాదాలు లేకుండా సురక్షిత ప్రయాణం సాగుతుందన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున శుక్రవారం రవాణాశాఖ కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు జాగ్రత్తగా బస్సులు నడిపించాలని, మీపై విద్యార్థుల జీవితాలు ఆధారపడి ఉంటాయన్నారు. ప్రతీ డ్రైవర్ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, బస్సులు కూడా కండిషన్‌లో ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. బాధ్యతతో బస్సు నడిపించాలని, అతివేగం పనికిరాదని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. బస్సులో వాహన నిబంధనల మేరకు సేఫ్టీ మేజర్స్ అన్నీ ఉన్నాయో లేదో చూసుకోవాలని ఆయన సూచించారు.

పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం



పోలేపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసంలో ఎంఈవో మంజులాదేవి

జడ్చర్ల, జూన్ 14 : జడ్చర్ల మండలంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చిన్నారులతో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్చర్ల మండలం పోలేపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి పాల్గొని, చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అంతకుముందు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే జడ్చర్ల మండలం గంగాపురం కాంప్లెక్స్ పరిధిలోని గంగాపురం, నెక్కొండ గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులతో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనంతప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్నదని ఎంఈవో మంజులాదేవి సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిర్మలాదేవి, సంతోషి, కృష్ణవేణి, శివకుమార్, అమూల్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

అడ్డాకుల, జూన్ 14 : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నదని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మూసాపేట మండల పరిధిలోని కొంరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తామని విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్డాకుల ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలనర్సింహులు, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మూసాపేట, అడ్డాకుల మండలాల అధ్యక్షులు శెట్టి శేఖర్, తోట శ్రీహరి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి

హన్వాడ, జూన్ 14 : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బుద్దారం గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కార్మికులకు పథకాలతో పాటు, పెళ్లికానుక, ప్రమాద బీమా, జనరల్ బీమా అందడం లేదని అన్నారు. కొత్తగా నమోదు చేసేందుకు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెల్ఫేర్ బోర్డులో ఉన్న పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరద గాలన్న, నాయకులు వెంకటయ్య, నర్సింములు, బుడ్డన్న, బాలకృష్ణయ్య, కృష్ణయ్య, అంజయ్య పాల్గొన్నారు.

సమాజానికి స్ఫూర్తి ప్రదాత చే గువేరా

పాలమూరు, జూన్ 14 : సమాజంలోని అందరికీ చే గువేరా స్ఫూర్తి ప్రదాత అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. శుక్రవారం దివిటిపల్లిలో చే గువేరా 96వ జయంతిని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ పెట్టుబడి దారి వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజమేనన్నారు. 1967 అక్టోబరు 9వ తేదీన చే గువేరాను సామ్రాజ్యవాద శక్తులు కాల్చిచంపారని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఆది విష్ణు, రామాంజనేయులు, సంజయ్, శశికుమార్, కోట్ల శ్రీనివాసులు, నిజాంపాషా, భానుప్రసాద్, మోహన్, రాజ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండా

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట, జూన్ 14 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని పర్ధిపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మోహన్‌రెడ్డి చెరువులో మోటార్ దించుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందారు. మృతునికి పార్టీ సభ్యత్వం ఉండటంతో పార్టీ ద్వారా వచ్చిన ఇన్సూరెన్స్ రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబసభ్యులకు ఆయన అందజేశారు. అలాగే గ్రామంలో బీరప్ప అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా ఆయన భౌతికదేహానికి పూలమాలవేసి, నివాళ్లర్పించారు. కాగా మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన నరసింహ బుక్‌స్టాల్‌ను సందర్శించారు. ఏవీఆర్ మొబైల్‌ను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము, మాజీ సర్పంచ్‌లు మోహన్‌గౌడ్, రఘువర్ధన్‌గౌడ్, అశోక్, కమ్మరి సుదర్శన్, రియాజ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడాలి

- మునిసిపల్ చైర్మన్ బస్వరాజు గౌడ్

భూత్పూర్, జూన్ 14 : సీనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు చాలా జాగ్రత్తలు పాటించాలని మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ సూచించారు. శుక్రవారం మునిసిపాలిటీలోని 10వ వార్డులో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు అంటువ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా నీటిని నిలువ ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిలువ లేకుండా చూసుకోవాలని, అదేవిధంగా కూలర్లు, పాత టైర్లల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని తెలిపారు. అంటువ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రబ్, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పనుల్లో కర్షకులు



నాగలి సాళ్లలో జొన్న విత్తనాలను వేస్తున్న మహిళా రైతులు

- ఆరుతడి పంటలపై అన్నదాతల ఆసక్తి

- తొలకరి వర్షాలతో జోరుగా సాగు పనులు

కోయిలకొండ, జూన్ 14 : తొలకరి వర్షాలు ముందే కురవడంతో వానాసల సాగు పనులు జోరందుకున్నాయి. రోహిణి కార్తెలోనే జొన్న, పత్తి తదితర విత్తనాలు వేస్తున్నారు. మండలంలో ఎక్కువ శాతం రైతులు ఆరుతడి పంటల సాగుపై ఆధారపడి ఉన్నారు. రైతులు ఎక్కువగా పచ్చజొన్నలు సాగు చేస్తున్నారు. వర్షాకాలానికి ముందే జొన్న పంట చేతికి అందడంతో పాటు రెండవ పంటగా వరి సాగు చేస్తారు. విత్తనాలు, ఎరువులు కొనేందుకు రైతులు దుకాణాల వద్ద బారులు తీరారు. విత్తనాలు తీసుకొన్న రైతులు తప్పకుండా రశీదు తీసుకోవాలని వ్యవసాయ అధికారి రాంపాల్ సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు వేసుకొంటే భూమి సారం పెరుగుతుందని, తెలంగాణ సోనా మసూరి జూన్ మాసంలో వేయవద్దని ఆయన తెలిపారు. పాలెం విత్తన పరిశోధన కేంద్రంలో పచ్చజొన్న, కంది తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

వ్యవసాయ పనుల్లో రైతులు

భూత్పూర్ : మండలంలోని రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. రోహిణి కార్తెలో అదును అయితే బాగుండేదని భావించిన అన్నదాత కల నెరవేరింది. రోహిణీ కార్తెలో విత్తనాలు వేసుకుంటే గింజలు గట్టిగా పండడంతో పాటుగా పంట దిగుబడి బాగా వస్తుందని రైతుల నమ్మకం. ఆరుతడి పంటలైన జొన్నలు, ఆముదాలు, మొక్కజొన్నలు, కందులు వంటివి వేసుకోవడానికి అదును అయ్యింది. ఆరుతడి పంటలతో పాటు పత్తి పంట సాగు కోసం రైతులు ముందుగా విత్తుకుంటున్నారు. పత్తి పంటను సాగు చేసుకోవాలంటే పొలం బాగా నానాలి. ప్రతీ సారి జూలై చివరి వారం, లేదా ఆగస్టు మొదటి వారం వరకు పత్తి పంటను సాగు చేసేవారు. ఈ సారి వర్షాలు మే నెల చివరి వారం నుంచే ప్రారంభం కావడంతో చాలా మంది రైతులు మొదట జొన్న, కందులు, మొక్కజొన్న వంటి పంటలతో పాటు పత్తి పంటను కూడా సాగు చేసుకున్నారు.



కోయిలకొండ : ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాలు కొంటున్న రైతులు

● మండలంలో మొత్తం 3,602 ఎకరాల భూమి ఉన్నది. పోయిన ఏడాది రైతులు సాగు చేసిన పంటల వివరాలను పరిశీలిస్తే.. పత్తి 5,304 ఎకరాల్లో, వరి 1704 ఎకరాలు, మొక్కజొన్న 177 ఎకరాలు, కంది 203 ఎకరాలు, జొన్న 776 ఎకరాలు మొత్తం 24,997 ఎకరాల్లో రైతులు పంటను సాగు చేశారు. ఈ సారి పత్తి పంట, జొన్న, వరి, ఆముదాలు, మొక్కజొన్న వంటి పంటలను రైతులు రెట్టింపు స్థాయిల్లో సాగు చేసే ఆవకాశం ఉన్నట్లుగా వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. అదేవిధంగా మండలంలో రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచారు. డీఏపీ 750 మెట్రిక్ టన్నులు అవసరముంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీధర్ తెలిపారు. అదేవిధంగా యూరియా 1500 మెట్రిక్ టన్నులు, పొటాష్ 150 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 375 మెట్రిక్ టన్నులు అవసరం ఉంటుందని, ఈ ఎరువులు ఇప్పటికే రైతులకు అందుబాటులో ఉంచినట్లుగా అధికారులు పేర్కొన్నారు. విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయని అధికారి తెలిపారు.

కొనసాగుతున్న విత్తనాలు వేసే పనులు

చిన్నచింతకుంట : మండలంలోని ఆయా గ్రామాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం పొలాల్లో విత్తనాలు వేసే పనులు జరుగుతున్నాయి. లాల్‌కోట, నెల్లికొండి, దాసర్‌పల్లి, అప్పంపల్లి, ఉంద్యాల, దమగ్నాపూర్ తదితర ప్రాంతాల్లో రైతులు పత్తిపంటను వేసేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. ఈ ప్రాంతాల్లో గతంలో పత్తిపంటను రైతులు అత్యధికంగా సాగు చేశారు. ప్రస్తుతం కూడా రైతులు పత్తి విత్తనాలు వేస్తున్నారు. వరి విషయంలోనే రైతులు కురుమూర్తి, అమ్మాపురం, ముచ్చింతల, తిర్మలాపూర్, అప్పంపల్లి తదితర ప్రాంతాల్లో రైతులు వరిని సాగు చేశారు. ఊకచెట్టువాగు శివారు ప్రాంతం కావటంతో రైతులు పెద్ద ఎత్తున వరిని సాగు చేస్తున్నారు. ఇప్పటికే రైతులు తుకాలు పోసుకున్నారు. కరిగెట చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.



చిన్నచింతకుంట : లాల్‌కోట శివారులో విత్తనాలు వేస్తున్న కూలీలు

స్పెషల్ డ్రైవ్‌తో ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ నిర్వహించిన వీసీలో కలెక్టర్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 14 : అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారుల, తహసీల్దారుల స్థాయిలో వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి త్వరగా పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి. రవినాయక్ వివరించారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని తగు సూచనలు, ఆదేశాలు ఇస్తూ శుక్రవారం హైదరాబాద్ నుంచి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంపై తీసుకుంటున్న చర్యలను వివరించారు.



వీసీ ద్వారా తహసీల్దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్

పెండింగ్ దరఖాస్తులను పది రోజుల్లో పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లాలోని రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తూ మండల స్థాయిలో తహసీల్దార్లు పెండింగ్ దరఖాస్తులను పది రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఆ మేరకు రోజువారీగా విభజించుకొని పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఉదయం క్షేత్రస్థాయిలో వెరిఫై చేయాలని, అదనపు సమయం కేటాయించి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, ఆర్డీవో నవీన్, అన్ని మండలాల తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

మహబూబ్‌నగర్ రూరల్ : మహబూబ్ నగర్ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ జి.రవి నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ సుందర్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు : కలెక్టర్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) : ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వలన వారు ప్రాణదాతలు అవుతారని కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. శుక్రవారం రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాత పాలమూరులోని కమ్యూనిటీ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జనరల్ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదానం చేసిన వారికి కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, జనరల్ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ జీవన్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ భాస్కర్‌నాయక్, డాక్టర్ జరీనా, పాథాలజి విభాగాధిపతి డాక్టర్ నావల్ కిశోర్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

● జడ్చర్ల : అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసిన రక్తదాత అమరవాది ప్రభును జడ్చర్లలో శుక్రవారం సన్మానించారు. వివిధ సందర్భాలలో దాదాపు 40 పర్యాయాలు రక్తదానం చేసిన ప్రభుకు పట్టణంలోని ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. బాలమణి, గోపాల్ గౌడ్, గోనెల రాధాకృష్ణ, రాజశేఖర్, చంద్రశేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 14 : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చే గువేరా జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్‌తో ఆడడం వల్ల మధోశక్తి పెంపొందుతుందని, చదువులో చురుకుగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, కిరణ్, గోపాలకృష్ణ, కుమార్, దినేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో వచ్చే నెల మూడు నుంచి ఆరవ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీ బ్రోచర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు మహబూబ్‌నగర్ వేదికకావటం సంతోషంగా ఉందని, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేందుకు స్టేడియం మైదానాలు అందుబాటులో ఉన్నాయన్నారు.



రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

క్రీడలకు తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్. శ్యామ్‌సుందర్‌గౌడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించుకునేందుకు అవకాశం లభించిందన్నారు. 10 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, 15 మంది ఆఫీషియల్స్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షులు విజయ్‌రెడ్డి, జి.శివప్రసాద్, కృష్ణకిషోర్, ఎంపీ ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్ ఎల్.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భానుప్రకాష్, ఈసీ మెంబర్ సతీష్, జోసెఫ్, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

డీకే అరుణకు ఘన సన్మానం

హన్వాడ, జూన్ 14 : పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన డీకే అరుణను హన్వాడ మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఆమె డిల్లీ వెళ్లి ఇటీవల తిరిగి జిల్లా కేంద్రానికి వచ్చారు. దీంతో హన్వాడ మండల నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో డీకే అరుణను ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమెను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రఘురాం గౌడ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు బాలగోపి, గంటా శ్రీనివాస్, సుమన్, వినిత్, భరత్, నరేష్, నరేందర్, శ్రీకాంత్ విష్ణు, ఆనంద్ గౌడ్, వెంకటయ్య, రంగన్న పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట

మిడ్జిల్, జూన్ 14 : దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడవసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రైతు సమ్మాన్ నిధుల కేటాయింపుపై మొదటి సంతకం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎన్. వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతితో కలిసి శ్రీనివాస్‌రెడ్డి, మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాని చేసిన తొలి సంతకం 9.3కోట్ల మంది రైతులకు లబ్ధిచేకురనుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లాలు, జిల్లా నాయకులు సత్యం, కృష్ణయ్య, నాయకులు నరేష్‌నాయక్, వాసుదేవ్, భాస్కర్, రామకృష్ణ, ఎల్లయ్య దేవేందర్, మహేందర్‌చారి, భీమయ్య బాలరాజు గౌడ్, చెన్నయ్య, అంజనేయులు, అంజి, చంద్రశేఖర్, రాము, అరవింద్, బాలు, నవీన్, సుధాకర్, లక్ష్మణ్, నారాయణ ఉన్నారు.



ఎంపీ అరుణను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

- మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, జూన్ 14 : భూత్పూర్ మునిసిపాలిటీలో చాలా కాలంగా వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మునిసిపాలిటీలో 2023-24 ఆర్థిక బడ్జెట్ సమావేశాన్ని స్థానిక కేవీన్ ఫంక్షన్ హాల్లో మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హాజరై మాట్లాడారు. మునిసి పాలిటీ కేంద్రంలో మార్కెట్ ఏర్పాటుకు, పెంచిన పన్నులపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల శాశ్వత పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మరుగుదొడ్లు, డంపింగ్ యార్డు ఏర్పాటుపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ 2023-24ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను సభలో చదివి వినిపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూ.6,69,00,049 కాగా, అందులో పన్నుల రాబడి రూ.2,60,00,082గా వచ్చినట్లుగా మునిసిపల్ చైర్మన్ వివరించారు. అదేవిధంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి మిగులు బడ్జెట్ రూ.3కోట్ల9లక్షలు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. చైర్మన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు కౌన్సిలర్లు ఏగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, మేనేజర్ అశోక్‌రెడ్డి, వివిధ వార్డులకు చెందిన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో జడ్చర్ల మునిసిపల్ బడ్జెట్

జడ్చర్ల : జడ్చర్ల మునిసిపాలిటీకి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.40కోట్ల11లక్షలతో బడ్జెట్‌ను రూపొందించారు. జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీ, కమిషనర్ రాజయ్య, వైస్‌చైర్మన్ పాలాది సారికల ఆధ్వర్యంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం నిర్వహించి, 2023-24 సంవత్సరం సవరణతో పాటు 2024-25 సంవత్సరం ఆర్థిక బడ్జెట్‌ను రూపొందించారు. రూపొందించిన బడ్జెట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతభత్యాలకు రూ.5కోట్లు, పారిశుధ్య నిర్వహణకు రూ.2కోట్ల60లక్షలు, విద్యుత్ బిల్లులకు రూ.కోటీ 2లక్షలు, 10శాతం నిధులు హరితహారానికి రూ.2కోట్ల4లక్షల50వేలు, చార్జ్‌డి ఖర్చులకు రూ.55లక్షలు కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంటు రూపంలో రూ.40కోట్ల11లక్షలు అంచనాతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మునిసిపల్ కార్యాలయ ఆడిట్ అధికారి ప్రమీలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి జిల్లా కార్యదర్శి డి.ఇందిర

న్యూలైఫ్ చిల్డ్రన్ హోమ్‌ను సందర్శించిన జిల్లా న్యాయాధికారి

పాలమూరు, జూన్ 14 : జిల్లా కేంద్రం అప్పన్నపల్లిలోని న్యూలైఫ్ చిల్డ్రన్ హోమ్‌ను శుక్రవారం న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా న్యాయాధికారి డి.ఇందిర సందర్శించారు. అక్కడ ఉన్న వసతులను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ అండ్ దెయిర్ ప్రొటెక్షన్ (ఎన్ఏఎల్ఎస్ఏ) స్కీం-2015 పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో డీడబ్ల్యూవో జరీనాబేగం, పీడీసీవో నర్మద, న్యూలైఫ్ చిల్డ్రన్‌హోం బృందం పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే

దేవరకద్ర, జూన్ 14 : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పంచాయతీ కార్యదర్శులు మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే నిర్వహించారు. ప్రతీ ఇంటికి తిరిగి మిషన్ భగీరథ ద్వారా నీరు వస్తుందా, లేదా అన్ని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ యాప్‌లో లబ్ధి దారుడి వివరాలు నమోదు చేశారు. అలాగే గ్రామాల్లో ఎన్ని నల్లా కనెక్షన్‌లు ఉన్నాయని వివరాలను సేకరిస్తున్నారు.

కమ్యూనిటీ భవనాలకు నిధులు ఇవ్వండి

- శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్‌కు వినతి

భూత్పూర్, జూన్ 14 : మండలంలోని వివిధ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు మండల వాసులు ఎమ్మెల్సీ సభ్యుడు బండ ప్రకాష్‌ను కోరారు. జిల్లా మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో గీత, మత్స్య సహకార సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో ప్రకాష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. శేరిపల్లి(హెచ్)లో మత్స్య సహకార సంఘం కమ్యూనిటీ భవనం, పోతులమడుగులో గీత కార్మిక కమ్యూనిటీ భవనం అసంపూర్తిగా ఉన్నాయని, వాటికి ఎమ్మెల్సీ నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్య, గీత కార్మికులు వెంకట్రాములు, యాదయ్య గౌడ్, శ్రీశైలంగౌడ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

20న పశువుల సంత వేలం

దేవరకద్ర, జూన్ 14 : 20న పశువుల సంత వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఈఓ సీత్యానాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 20024-25 సంవత్సరానికి గాను సంతకు పశువులు, గొర్రెలు మేకలు, కోళ్ల విక్రయానికి గాను వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంత వేలంలో పాల్గొను వారు బ్యాంక్‌లో డీడీ కట్టి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒక రోజు ముందుగా అందించాలన్నారు. 20న ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

భూత్పూర్, జూన్ 14 : రైతులు వ్యవసాయంలో సకాలంలో స్పందించి సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి లాభాలు గడించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీధర్ సూచించారు. శుక్రవారం మండలంలోని వెల్కిచర్ల గ్రామంలో రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన రైతుల ప్రత్యేక సమావేశంలో రైతులు వ్యవసాయంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ వంటి విషయాలను ఏవో వివరించారు. మేలురకాల విత్తనాల ఎంపిక, యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకం, వంటి వాటిపై రైతులకు ఏవో వివరించారు. అదేవిధంగా పామాయిల్ తోటల పెంపకంపై ఉద్యానవన శాఖ అధికారి మహేందర్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ ఏరియా మేనేజర్ బాలరాజు, క్లస్టర్ అధికారి శ్రీకాంత్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ కుటుంబానికి ఆర్థిక సాయం

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 14 : పాలమూరు యూనివర్సిటీ ప్రారంభం నుంచి నాన్ టీచింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహించిన సత్యనారాయణ కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఆయన అకాల మరణం ఆ కుటుంబానికి తీరనిలోటు అని, అతని పీయులో చేసిన సేవలను గుర్తు చేసుకొన్నారు. పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రకిరణ్, పీయూ అధికారులు, పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగులు జమచేసిన రూ.42,000లను సత్యనారాయణ సతీమణి నందినతికి అందజేశారు. పీయూ అధికారులు, ప్రొఫెసర్ జైపాల్‌రెడ్డి, డాక్టర్ నూర్జహాన్‌బేగం, డాక్టర్ గాలెన్న, డాక్టర్ పర్వతాలు, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రవి కుమార్, రామరాజు, నాన్ టీచింగ్ సిబ్బంది జానకిరాములు, కిరణ్ కుమార్, సత్యంగౌడ్, రమాదేవి, కేర్‌టేకర్ రవికుమార్ పాల్గొన్నారు.